స్వామివారి పాదాల మెట్లను పునరుద్ధరించాలి

ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్

యాదగిరిగుట్ట, ఆగస్టు 11 : యాదగిరి కొండ కింద గాంధీనగర్‌లో స్వామివారి పాదాల మెట్లను పునరుద్ధరించాలని మాజీ ఎంపీటీసీ సీస కృష్ణగౌడ్ కోరారు.

ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఈఓ భాస్కర్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. స్వామివారి పాదాల మెట్లకు ఎంతో చరిత్ర ఉందన్నారు. రోజూ స్వామివారి పాదాల మెట్లను స్థానికులు, భక్తులు పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని తిరిగి కొనసాగించాలని వినతి పత్రంలో కోరారు.

ఆలేరు రెవెన్యూ డివిజన్‌కు కృషి చేయాలని వినతి

మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శోభారాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, ఆగస్టు 11 : ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణిని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు ఆలేరు పట్టణంలో ఆదివారం వినతిపత్రం అందజేసి సన్మానించారు.

కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పసుపునూరి వీరేశం, ఎండీ సలీమ్, మొరిగాడి శేఖర్, పేరపు రాములు, చింతకింది మురళి, జూకంటి పౌల్, బొమ్మకంటి బాలరాజు పాల్గొన్నారు.

సరస్వతీ మాత విగ్రహావిష్కరణ కరపత్రం విడుదల

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 11 : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 14న ఉదయం 9:35 గంటలకు నిర్వహించనున్న సరస్వతీ మాత విగ్రహావిష్కరణకు హాజరు కావాలని అభినవ యూత్ అసోసియేషన్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టై అండ్ డై అధ్యక్షుడు భారత లవకుమార్, అభినవ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్కాల గణేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవీందర్, సహాయ కార్యదర్శి వేముల నరేశ్, కోశాధికారి వల్లాల బాలరాజు, సభ్యులు సాయికుమార్, గుజ్జ పద్మ పాల్గొన్నారు.

ఈ నెల 18వరకు మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

సమావేశంలో మాట్లాడుతున్న బాంబినో పరిశ్రమ ఎండీ సంధ్య

బీబీనగర్, ఆగస్టు 11 : బీబీనగర్ పరిసర ప్రాంత మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బాంబినో పరిశ్రమ ఎండీ సంధ్య అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో బాంబినో పాస్తా ఫుడ్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక సహాయంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫెర్నాండేజ్ హాస్పిటల్, సీపాత్ లాబ్స్, వ్యూహ మెడ్ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం నుంచి 18వరకు సమగ్ర ఆరోగ్య పరీక్షలతోపాటు రొమ్ము, సెర్వికల్ క్యాన్సర్లను ముందుగానే గమనించే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఆధునిక లిక్విడ్ బేస్డ్ సైటోలజీ అను క్యాన్సర్ గుర్తింపు పరీక్షను ఉపయోగించి క్యాన్సర్ రాకముందే, వచ్చే అవకాశమున్న మహిళలను గుర్తిస్తారని తెలిపారు. వారికి తగు చికిత్స, తీసుకోవలసిన చర్యల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. ఈ శిబిరంలో నిపుణులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉండి స్వయంగా పరీక్షలు జరుపుతారని తెలిపారు. 20నుంచి 60 సంవత్సరాల వయస్సు గల మహిళలు వచ్చి పరీక్షలు జరిపించుకోవాలని సూచించారు. వివరాల కోసం 7075717242లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజనీ చక్రవర్తి, ప్రొఫెసర్ రేణు జాన్, డాక్టర్ కామేశ్వరి పాల్గొన్నారు.

'ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను అమలు చేయాలి'

మంతపురిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ ప్రధానకార్యదర్శి కందుల శంకర్

ఆలేరు రూరల్, ఆగస్టు 11 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను చట్టసభల్లో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కందుల శంకర్ అన్నారు. మండలంలోని మంతపురి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రకారం రిజర్వేషన్ శాతం పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందుల చంద్రకళ, ఎమ్మార్పీఎస్ నాయకులు కందుల నర్సింగ్‌రావు, బైరపాక నాగరాజు, కిషన్, బాలచందర్, బాలనర్సయ్య, రాంచంద్రయ్య, సూర్యం, భిక్షపతి, సిద్ధులు పాల్గొన్నారు.

మాదిగల విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

వలిగొండ, ఆగస్టు 11 : హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించే మాదిగల విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ల వాటా కోసం 30సంవత్సరాలు పోరాటం చేసి విజయం సాధించిన మంద కృష్ణమాదిగ హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా నిర్వహించే విజయోత్సవ ర్యాలీకి మాదిగలు ఇంటికొకరు తరలి రావాలని కోరారు. సమావేశంలో పల్లెర్ల రాంచంద్రం, దుబ్బ దానయ్య, సలిగంజి భిక్షపతి, నల్ల స్వామి, అరుణ్‌కుమార్, ఐలయ్య పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట, ఆగస్టు 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ పాతగుట్ట (పూర్వగిరి) ఆలయంలో ఆదివారం స్వాతినక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయం ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగాది, సప్తనదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులకు వేద మంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. ఎటుచూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శివాలయం, శ్రీవారి మెట్ల మార్గం సందడిగా మారాయి. సుమారు 40వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయం ముఖ మండపంలో దర్బార్ సేవలో భాగంగా సువర్ణమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి, నక్షత్ర హారతి ఇచ్చారు. స్వామివారి ఖజానాకు రూ.53,45,736 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు

కలశాలను తీసుకొస్తున్న ఆలయ ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు

కుటుంబ సభ్యులతో కలిసి గిరిప్రదక్షిణలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

సామూహిక గిరిప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంలో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 6:05 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు పాల్గొన్నారు. కొండ చుట్టూ కాలినడకన పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. గిరి ప్రదక్షిణలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఉదయం 6:30 గంటలకు కొండ చుట్టూ కాలినడకన గిరిప్రదక్షిణ చేశారు. అనంతరం స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాశ్

పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రం అందుకుంటున్న ప్రకాశ్

గుండాల, ఆగస్టు 11 : పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గుండాల మండల కేంద్రానికి చెందిన చిందం ప్రకాశ్ నియమితులయ్యారు. యాదగిరిగుట్టలో ఆదివారం జరిగిన పద్మశాలి సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం నాయకులు ఏలూరు కృష్ణ, పగడాల అంబదాసు, ఆంజనేయులు, దశరథ, సత్యనారాయణ, నగేశ్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్, ఆగస్టు 10 : పీఏసీఎస్‌లో బర్రెలు, గొర్రెలు, పట్టుపురుగుల పెంపకం, కోళ్లఫాం, ట్రాక్టర్లు, వరికోత మిషన్లు, పాలీ హౌజ్, పందిరి కూరగాయలకు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు కావాల్సిన రైతులు సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు

గుండాలలో గ్రామ దేవతలకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గుండాల : పాచిల్ల గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గుండాల, ఆగస్టు 11 : మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రజలు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే గ్రామాల్లో బోనాల సందడి నెలకొన్నది. ఆయా గ్రామాల్లో ఎడ్లబండ్లతో ప్రదర్శన చేశారు. మహిళలు ఆటపాటలతో, డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బోనాల పండుగలో అపశృతి

మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గుడి వద్ద అపశృతి చోటుచేసుకుంది. నూనెగూడెం గ్రామానికి చెందిన భక్తులు బోనాలు సమర్పించిన అనంతరం దీపం వెలిగించారు. దాంతో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గుడితో పాటు అక్కడే ఉన్న భారీ వృక్షం దగ్ధమైంది. మంటలు భారీగా ఎగిసిపడటంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్ గుడి వరకు వెళ్లలేకపోయింది. అనంతరం మంటలు అదుపులోకి రావడంతో అగ్నిమాపక వాహనం వెనుదిరిగి వెళ్లిపోయింది.

ముత్యాలమ్మకు బోనాలు

మోత్కూరు : శ్రావణ మాసం పురస్కరించుకొని మండలంలోని దత్తప్పగూడెం, ధర్మాపురంలో ముత్యాలమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను అలంకరించుకొని గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు.

బొమ్మలరామారం : మండలంలోని రాంలింగంపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆదివారం పోచమ్మ తల్లికి, గ్రామ దేవతలకు బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయం వద్ద బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు తొట్టెల ఊరుగింపుతో సందడి చేశారు.

అర్బన్ కాలనీలో పోచమ్మ తల్లి బోనాలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 11 : పట్టణంలోని అర్బన్ కాలనీలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కాలనీ ప్రజలు డప్పు వాయిద్యాలతో, శివసత్తుల పూనకాల నడుమ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పొత్నక్ ప్రమోద్‌కుమార్, తంగళ్లపల్లి రవికుమార్, పోలిశెట్టి అనిల్‌కుమార్, వినోద్, రాజు, జహంగీర్, సాయికిరణ్, హరీశ్, జైరామ్, హమీద్, పృథ్వీరాజ్, శ్రవణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రామాజీపేట గ్రామ శాఖ అధ్యక్షుడిగా స్వామిగౌడ్

యాదగిరిగుట్ట : రామాజీపేట గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామిగౌడ్‌కు ఎన్నిక పత్రం అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 11 : బీఆర్ఎస్ పార్టీ రామాజీపేట గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఆరె స్వామిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని రామాజీపేటలో ఆదివారం డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కన్వీనర్‌గా నమిలె వెంకట్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా మొగిలిపాక భాస్కర్ ఎన్నికయ్యారు. రామాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని అహ్మదీనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా యాట పరశురాం, సెక్రెటరీ జనరల్‌గా పేర్మాండ్ల ముత్యాలు ఎన్నికయ్యారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమలారమేశ్, పాల సంఘం చైర్మన్ జాగిళ్లపురం దశరథ, నాయకులు గడ్డం దేవేందర్, కల్లూరి రఘుపతిరెడ్డి, మొగిలిపాక యాదగిరి పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్రం

● ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్

భువనగిరి అర్బన్, ఆగస్టు 11 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న సంఘం విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులో ఆదివారం ఆయన మాట్లాడారు. దేశంలో 30కోట్ల మంది ఉన్న ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వెనుకబడిన మైనార్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో పది శాతం కేటాయించాలని, రిజర్వేషన్లు కల్పించాలని జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ చెప్పిన నిర్ణయాలను పక్కన పెట్టిందని విమర్శించారు. మైనార్టీ పేదల కోసం కొంత మంది ముస్లిం పెద్దలు వందల ఎకరాల భూములను వక్ఫ్ బోర్డుకు ఇచ్చారని, ఆ భూమిని ముస్లిం మైనార్టీలకు పంచకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తూ స్థానిక ఆర్డీఓలకు అప్పజెప్పాలని చూస్తున్నదని తెలిపారు.

అలాంటి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమే ఒక రకమైన కుట్ర అన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ ఇక్బాల్, మీర్ ఖాజా అలీ, నాయకులు ఎస్‌కే లతీఫ్, ఉమర్, ఇమామ్ పాషా, మీర్ యూసుఫ్ అలీ, ముక్తార్ హుస్సేన్, ఎండీ పాషా, జాకీర్, అబీద్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

తుర్కపల్లి, ఆగస్టు 11 : మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ తకియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం శివన్ జిల్లా కౌసర్ గ్రామానికి చెందిన మున్నాకుమార్ గోండు హైదరాబాద్ ఐడీఏ మల్లాపురంలో స్క్రాప్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం ముల్కలపల్లి గ్రామంలోని ఇనుప స్క్రాప్‌ను మున్నాకుమార్ డీసీఎంలో లోడ్ చేస్తుండగా.. ఇనుప పైపు పైన ఉన్న కరెంట్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే 108లో భువనగిరి ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

గిరిధర్ (ఫైల్)

మోటకొండూర్, ఆగస్టు 11 : మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన అయిలి గిరిధర్ శుక్రవారం గ్రామపంచాయతీ వీధి లైట్లు వేస్తుండగా.. విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికందిన కుమారుడు మృతిచెందడంతో గిరిధర్ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. గిరిధర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పగిడిపల్లి సమీపంలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

పూర్ణగిరి ఆలయంలో గిరిప్రదక్షిణ

భువనగిరి అర్బన్, ఆగస్టు 11 : మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా ఆదివారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద ఆశీర్వచనం చేసి సన్మానించారు. కార్యక్రమంలో నరసింహస్వామి ఉపవాసకులు బత్తిని రాములుగౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లంల శాలినీజంగయ్య, ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు హేమేందర్‌గౌడ్, బాలరాజు, భిక్షపతి, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, ఆలయ పూజారి పవన్ కుమార్‌శర్మ, భక్తులు పెద్ద పాల్గొన్నారు. పడిగిపల్లి గ్రామ సమీపంలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పూజల్లో పాల్గొన్నారు.

జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

భువనగిరి అర్బన్, ఆగస్టు 11 : వరంగల్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ యోగిరెడ్డి మృతి బాధాకరమని, ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్‌బాబా కోరారు. పట్టణంలోని వినాయక చౌరస్తాలో జర్నలిస్ట్ యోగిరెడ్డి చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రత, కుటుంబ పరిస్థితులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నబత్తిని మ్యాథ్యూస్, ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డిండి లిఫ్ట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 10 : మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని కరువు ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగునీటిని అందించే డిండి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి లిఫ్ట్‌ను పూర్తి చేసి తక్షణమే 3.61లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పథకాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఈటి నర్సింహ, ఉజ్జిని రత్నాకర్‌రావు, పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి, బద్దుల సుధాకర్, నర్సింహ, మంకులు, రాములు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు

మోత్కూరు పోతాయిగడ్డలో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు, డ్రైనేజీ

మోత్కూరు, ఆగస్టు 11 : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై వర్షం నీరు, మురుగు నిలిచి అధ్వాన్నంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. దీంతో వర్షం వచ్చినప్పుడు వరద, ఇండ్లలోని మురుగు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వస్తున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంకు వరకు, పాత గ్రామీణ వికాస్ బ్యాంకు నుంచి ఎస్‌బీఐ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగు రోడుపైకి వస్తున్నది. దీంతో దుర్వాసన వస్తుందని, ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. రోడ్డుపై వర్షం నీరు నిలువకుండా, మురుగు రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ సైదులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 11 : రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సైదులు అన్నారు. మండలంలోని కప్రాయపల్లిలో సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి, గుడుంబా నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట పోలీసులు శ్రీను, ప్రేమలత ఉన్నారు.